ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY
ఏలూరు జిల్లా వార్తలు
5
సోమవారం 9 జూన్ 2025

గ్రామాల్లో..నవోదయం



- సారా తయారీ వీడిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి
- 132 కుటుంబాలకు రుణాలు అందజేత
- సారా రహితంగా 142 గ్రామాలు సిద్ధం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఏరులై పారుతున్న సారా రక్కసిని అంతమొందించేందుకు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు చేపట్టిన నవోదయం -2.0 వేగం పుంజుకుంది. త్వరలో 142 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సారా తయారీ వీడిన కుటుం బాలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలకు రంగం సిద్ధం చేశారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ, పశుసంవర్థకశాఖ, ఇతర శాఖల సమన్వయంతో 132 కుటుంబాలకు ఉపాధి బాట చూపించేందుకు రుణాల మంజూరు ఈ వారంలో పూర్తి చేయనున్నారు. స్త్రీ నిధి కింద 35 మందికి ఒక్కో మహిళకు రూ.లక్ష రుణం ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. ఉన్నతి కింద మరో 32 మందికి, బ్యాంకుల ద్వారా 65 మంది మహిళలకు 12 శాతం వడ్డీకి విస్తరాకుల యూనిట్లు, గొర్రెలు, స్వీట్ షాపులు, కూరగాయలు, పూల దుకాణాల ఏర్పాటు చేసుకునే అవకాశాలను కల్పించారు. ఇదిలా ఉండగా సారా తయారీ నిలుపుదలతో ప్రతీ నెల సగటున రూ.4 కోట్ల ఆదాయం వైన్‌షాపుల ద్వారా పెరగడం విశేషం. ఏప్రిల్ రూ.3.6 కోట్లు, మేలో రూ.4 కోట్ల ఆదాయం పెరిగింది.

142 గ్రామాల్లో ప్రశాంతం

జిల్లాలో ఏడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లు ఉండగా, ఇందులో ఐదు స్టేషన్ల పరిధిలోని భీమడోలు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు, చింతలపూడిలోని 16 మండలాల్లో 142 గ్రామాల్లో సారా ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిని సమూలంగా నిర్మూలించేందుకు నవోదయం 2.0తో అన్ని గ్రామాల్లో లఘు నాటికలు, కళాజాతాలు, అధికారుల, ప్రజా ప్రతినిధులతో కలిసి సమావేశాలు, పల్లె నిద్రలు ఏప్రిల్ నుంచి మే వరకు చేపట్టారు. ఈక్రమంలో 142 గ్రామాలను ఈనెల 15వ తేదీలోగా సారా రహిత గ్రామాలుగా ప్రకటించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 26 జిల్లాల్లో నవోదయం 2.0 కింద సారా నిర్మూలనకు సెప్టెంబరు 30 వరకు గడువు ఇచ్చారు. అయితే జిల్లా అధికారులు గతేడాది అక్టోబరు లోనే సారా తయారీదారులపై ఉక్కుపాదం మోపారు. బట్టీలను ధ్వంసం చేసి, తయారీకి ఉపయోగించే బెల్లపు నిల్వలు, ఇతర పదార్థాలను అటు వెళ్లనీయకుండా కట్టడి చేశారు. పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీపేట, ముద్దప్ప గూడెం, చింతలపూడి మండలంలోని నాగిరెడ్డిగూడెం, కంచన గూడెం, పంతంగు గూడెం, జంగారెడ్డిగూడెం మండంలోని శ్రీధరవేలేరు, మారేడుబాక తదితర ఏడు గ్రామాల్లో సారా ఆనవాళ్లు లేకుండా ఉండేందుకు జల్లెడ పడుతున్నారు. ఈ గ్రామాలు పూర్తయితే ఇక సారా రహిత జిల్లాగా ఏలూరును ప్రకటించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌తో కలిసి జిల్లా ఎక్సైజ్ అధికారులు ఆవులయ్య, పాండు రంగారావు తదితరులు గ్రామాల్లో పల్లె నిద్రలను ఇటీవల చేపట్టారు. ఆయా గ్రామాల్లో సారా తయారు చేయమని, తాగమని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల 15వ తేదీలోగా సారా రహిత గ్రామాలుగా 142 గ్రామాలను డిక్లేర్ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. ఇటీవల కంచనగూడెంలో స్పిరిట్ తయారు చేస్తున్న వారిపై దాడులు చేసి ధ్వంసం చేశామన్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు!



ఏలూరులోని టిడ్కో ఇళ్లు

విజయదశమి లోపే పక్కా ముహూర్తం అన్నారు. సంక్రాంతిలోపే జరిగి తీరుతుందన్నారు. మళ్లీ,మళ్లీ ముహూర్తం మార్పు. గత ఐదేళ్ల జగన్ జమానాలో టిడ్కో ఇళ్లను పాడుపెట్టారు. అధికార పగ్గాలు చేపట్టిన టీడీపీ సైతం ఏడాది పొడవునా ఇదే చేస్తోంది. ఏడేళ్ల క్రితం టిడ్కో ఇళ్లకు తాము కట్టిన డిపాజిట్లు ఏమయ్యాయో తెలియక ఇప్పటికే పేదవర్గాల లబోదిబోమంటున్నాయి. మరి టిడ్కోకు ముహూర్తం ఎప్పుడు..?

ఏడేళ్లుగా పేదల ఎదురుచూపులు

- ఇప్పటికీ పూర్తి కాని టిడ్కో సముదాయాలు
- పలుమార్లు ముహూర్తాలు.. ఆ వెనువెంటనే వాయిదాలు
- ఏలూరు మినహా, మిగతా చోట్ల ఒక్కటీ పూర్తి కాలేదు
- ఎవ్వరికి పట్టని ఇళ్లు.. పేదల ఆగ్రహం

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పక్కా గృహాల్లో పదిలంగా ఉండవచ్చని పేదలంతా సంబరపడ్డారు. ఇక అద్దె కష్టాలు తప్పుతాయని మురిసిపోయారు. ఇరుగు, పొరుగుకి ఇదే చెప్పుకున్నారు. ఇదంతా ఏడేళ్ల క్రితం మాట. అప్పట్లో టిడ్కో ఇళ్ల సముదాయాన్ని మూడు విభాగాలుగా చేసి వివిధ తరగతుల వారికి కేటాయించారు. ఏలూరుతో సహా నూజివీడు, జంగారెడ్డిగూడెంల పరిధిలో టిడ్కో ఇళ్ల సముదాయాల్లో శరవేగంగా పనులు సాగాయి. 2019 ఎన్నికలకు ముందే ఏలూరులోని టిడ్కో గృహ సముదాయంలో కొన్ని ఇళ్లల్లోనైనా పేదల చేత గృహ ప్రవేశాలు చేయించాలని భావించారు. ఆ మేరకే పేదలను ఊరించారు. ఇంకేముంది క్షణాల్లో టిడ్కో గృహ సముదాయం పూర్తి చేస్తామంటూ గప్పాలు కొట్టారు. 2019లో అధికార పగ్గాలు చేపట్టిన వైసీపీ టిడ్కో వైపు కన్నెత్తి చూస్తే ఒట్టు. కనీసం పూర్తయిన గృహాలను పేదల పరం చేసేందుకు ఆనాటి వైసీపీ ప్రభుత్వానికి మనసొప్పలేదు. ఏలూరు నగర పరిధిలో సుమారు 6వేల480 టిడ్కో గృహ సముదాయం నిర్మించాలని తలపెట్టినా తొలిదశలో 2,208 గృహాలను నిర్మించారు. వీటిలో కొన్ని అసంపూర్తిగాను, మరికొన్ని పూర్తిచేసినట్టు రికార్డుల్లో చూపించారు. జగన్ జమానాలో టిడ్కో ఇళ్ల గృహ ప్రవేశాలకు నాలుగైదు సార్లు ముహూర్తాలయితే నిర్ణయించారు కానీ, వీటిలో ఏ ఒక్కటీ అమల్లోకి రాలేదు. ఈలోపే జగన్ హయాం ముగిసి, టీడీపీ ప్రభుత్వం వచ్చింది. ఈ ఏడాదిలోపే ఎట్టి పరిస్థితుల్లోనూ టిడ్కో ఇళ్లకు మోక్షం కల్పిస్తామని చెబుతూ వస్తున్నారు. కానీ ఇది కూడా సాధ్యపడలేదు. ప్రత్యేకించి నగర ,పట్టణ ప్రాంతాల్లో సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు సమస్త సౌకర్యాలు కలిగిన టిడ్కో ఇళ్లను ఆశిస్తారు. ప్రభుత్వం నిర్దేశించినట్లుగానే ఏడేళ్ల క్రితమే కొంత సొమ్ము డీడీల రూపంలో చెల్లించారు. నిర్మాణ ప్రాతిపదికన లబ్ధిదారులకు ఆ మేరకు ఇళ్ల కేటాయింపులు ఉంటాయని ప్రతీసారి బుకాయిస్తూ వస్తున్నారు.

నూజివీడు, జంగారెడ్డిగూడెంల్లోను ఇదే తంతు

నూజివీడు మున్సిపాలిటీ పరిధిలోనూ, జంగారెడ్డిగూడెం నగర పంచాయతీ పరిధిలోనూ టిడ్కో ఇళ్లను సగం కట్టి వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పిచ్చిమొక్కలు మాటున ఈ సముదాయాలు కనిపిస్తున్నాయి. నూజివీడులో సుమారు 4వేలకు పైగా టిడ్కో ఇళ్లను 2018లో మంజూరు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం 2,640 గృహాలను నిర్మించేందుకు కదిలారు. అయినా ఇందులో ఏ ఒక్క గృహం ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. ఐదేళ్ల జగన్ జమానాలో టిడ్కో ఇళ్లు అన్ని ప్రచారానికి పనికొచ్చాయే తప్ప, పేదల అవసరాలను తీర్చలేకపోయాయి. దీనికి తోడు కేటాయింపు దగ్గర నుంచి నిర్మాణం వరకు అన్నీ వివాదాలే. జగన్ పాలన పీడ విరగడ అయ్యిందనుకున్న ఈ ఏడాది పొడవునా టిడ్కో ఇళ్లను పూర్తి చేసేందుకు (మిగతా 8వ పేజీలో)

నేడు టెన్త్, ఇంటర్ టాపర్లకు షైనింగ్ స్టార్స్ పురస్కారాలు

ఏలూరు అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ టాపర్లు, జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ టాపర్లను షైనింగ్ స్టార్స్ పురస్కారాలతో సత్కరించేందుకు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఈ ప్రోగ్రాం నిర్వహణపై ఆదివారం సాయంత్రం విద్యాశాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, జడ్పీ చైర్‌పర్సన్ పాల్గొంటారన్నారు. టెన్త్ టాపర్లు 163 మంది, ఇంటర్ టాపర్లు 34 మందిని పురస్కారాలకు ఎంపిక చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సహా సుమారు 500 మందికి పైగా వస్తారనే అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నారు. సమీక్షలో డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పరీక్షలకు 60 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా ఆదివారం స్థానిక సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి ఉదయం షిఫ్టు పరీక్షకు 208 మంది అభ్యర్థులను కేటాయించగా 202 మంది, మధ్యాహ్నం షిఫ్టునకు 204 మందికి 174 మంది హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రానికి మధ్యాహ్నం షిఫ్టునకు 180 మందిని కేటాయించగా 156 మంది హాజరయ్యారు. మొత్తం మీద 60మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

రేపు కేఆర్‌పురం వైటీసీలో జాబ్‌మేళా

బుట్టాయగూడెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేఆర్ పురం ఐటీడీఏలోని వైటీసీ కార్యాలయంలో నేషనల్ కెరీర్ సర్వీస్, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పీవో కె.రాములు నాయక్ తెలిపారు. జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అభ్యర్థులు పూర్తి బయోడేటాతో, సంబంధిత ధ్రువ పత్రాలతో హాజరు కావాలన్నారు. అభ్యర్థులు 10వ తరగతి, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన వారు, 18-26 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. వివరాలకు 88868 82032 నంబరును సంప్రదించాలన్నారు.

హైస్కూలు టీచర్లకు శిక్షణ తరగతులు వాయిదా

ఏలూరు అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సెకండరీ విద్యను బోధించే స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులకు జిల్లాలోని డివిజన్ కేంద్రాల్లో సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించ తలపెట్టిన శిక్షణ తరగతులు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం సాధారణ బదిలీలు జరుగుతుండడం, మరోవైపు వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో హడావుడిగా ఈ శిక్షణ తరగతులను నిర్వహించడం సరికాదని ఉన్నతాధికారులు భావించడంతో వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ సోమవారం ప్రకటించే అవకాశం ఉంది. జిల్లాలో ఈ శిక్షణ తరగతులను 3250 మంది స్కూల్ అసిస్టెంట్‌లకు, మరో 100 మందికి పైగా హెచ్‌ఎంలకు ఇవ్వాల్సి ఉంది.



మహిళాగ్రహం

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు

బదిలీల సంక్షోభంపై మంత్రి లోకేశ్ జోక్యం చేసుకోవాలి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్

■ లోపలి పేజీలో..

ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలు విడుదల

- ఇంజనీరింగ్ ప్రవేశాల్లో 3,409 మందికి, అగ్రికల్చర్,ఫార్మాలో 1,726 మందికి అర్హత
- జిల్లా టాపర్లుగా పలువురికి రాష్ట్రస్థాయి ర్యాంకులు

ఏలూరు అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా వున్న ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్-2025 ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌కు జిల్లాలో మొత్తం 4,874 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, పరీక్షకు 4,700 మంది హాజరయ్యారు. వీరిలో 3,409 మంది అర్హత సాధించారు. ఉత్తీర్ణుల్లో 1,817 మంది యువకులు, 1,592 మంది యువతులు ఉన్నారు. అగ్రికల్చర్ పరీక్షకు మొత్తం 2,002 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 1,899 మంది హాజరయ్యారు. వీరిలో 1,726 మంది అర్హత సాధించారు. ఉత్తీర్ణుల్లో 443 మంది యువకులు, 1,283 మంది యువతులు ఉన్నారు. కాగా రాష్ట్రస్థాయి టాప్‌టెన్ ర్యాంకుల్లో ఏలూరు జిల్లా నుంచి ఒక్కరూ సాధించలేకపోయారు.

ఇంజనీరింగ్ జిల్లా టాపర్లు వీరే

ఇంజనీరింగ్ విభాగంలో ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురానికి చెందిన పాకలపాటి హర్షవర్ధన్ (86.2448 కంబైన్డ్‌స్కోరు) రాష్ట్ర స్థాయిలో 85వ ర్యాంకు సాధించి ఏలూరు జిల్లా టాపర్‌గా నిలిచాడు. తదుపరి స్థానాల్లో ఏలూరు మంచినీళ్లతోటకు చెందిన అల్లు హేమంత్ (85.6014) 97వ ర్యాంకు, కొయ్యలగూడెం మండలం పరింపూడికి చెందిన బండ్లపల్లి యోగసాయి శ్రీనివాస్(82.4738) 162వ ర్యాంకు, కామవరపుకోటకు చెందిన ద్వాదశి మోహన(78.4000) 313వ ర్యాంకు, కామవరపుకోటకు చెందిన నూనె రమేశ్(77.2051) 358వ ర్యాంకు, కామవరపుకోటకు చెందిన ముత్తంశెట్టి వెంకట్ హనీష్(76.8463) 378వ ర్యాంకు, టి.నరసాపురం మండలం బందంచర్లకు చెందిన అనుమోలు తరుణ్‌సాయి (7.5349) 401వ ర్యాంకు, లింగపాలెం మండలం యడవల్లికి చెందిన గోల్కొండ జయదీప్ శరణ్ (76.4237) 409వ ర్యాంకు, పోలవరానికి చెందిన పడాల జశ్వంత్ సాయిచరణ్ (76.1720) 421వ ర్యాంకు, చింతలపూడి మండలం రాఘవాపురానికి చెందిన మారుమూడి సిరిసంజన(75.8859) 438వ ర్యాంకు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు.

అగ్రికల్చర్, ఫార్మసీ జిల్లా టాపర్లు వీరే

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో జిల్లా టాపర్లుగా పలువురు విద్యార్థులు నిలిచారు. పెదపాడు మండలం కొక్కిరపాడుకు చెందిన కోసూరి వల్లీప్రియ 86.6381 కంబైన్డ్ స్కోరుతో రాష్ట్రస్థాయిలో 59 ర్యాంకు సాధించి జిల్లా టాపర్‌గా తొలిస్థానంలో నిలిచింది. ఈమె తదుపరి ఏలూరు రూరల్‌మండలం తూర్పువీధికి చెందిన యర్రా శోభారిషిత (83.9868 స్కోరు) 109వ ర్యాంకు, జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరానికి చెందిన కొట్టే వెంకటశ్రీ శశాంక్ (79.1322) 283వ ర్యాంకు, కొయ్యలగూడెం మండలం రాజవరానికి చెందిన తిరుమలనాథుని సత్యసృజన్ (78.5450) 313వ ర్యాంకు, లింగపాలెం మండలం కొణిజెర్లకు చెందిన లక్కపాము కమలాకర్ (78.4589) 318వ ర్యాంకు సాధించారు. నూజివీడుకు చెందిన కుప్పాల దేదీప్య సాయి(77.9011) 358వ ర్యాంకు, టి.నరసాపురం మండలం సాయంపాలెంకు చెందిన మారిశెట్టి భాగ్యశ్రీ (77.6931) 375వ ర్యాంకు, కలిదిండి మండలం దుంపలకోడు దిబ్బకు చెందిన వల్లభుని దినేశ్ సాయి(77.6461) 378వ ర్యాంకు, ఏలూరు కొత్తపేటకు చెందిన భీమవరపు హరిప్రియ రామన్(76.7301) 447వ ర్యాంకు, పెదవేగి మండలం భోగాపురానికి చెందిన దిమ్మిటి యామిని(76.7018) 448వ ర్యాంకు సాధించారు.

గంజాయి రవాణా..?

ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

ఏలూరు క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమ రవాణ జరుగుతోందన్న సమాచారంతో ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి ఆకస్మికంగా రైల్వే పోలీస్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రైల్వే డీఐజీ వి.సత్యఏసుబాబు, విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ ఆదేశాలతో విజయవాడ డీఎస్పీ జి.రత్నరాజు పర్యవేక్షణలో విజయవాడ రైల్వే సీఐ ఎంవీ దుర్గారావు, ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్, ఆర్పీఎఫ్ సిబ్బంది కలిసి ఆదివారం రాత్రి ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. వెయిటింగ్ హాల్స్, బుకింగ్ ఆఫీసులు, రిజర్వేషన్ కౌంటర్, పార్శిల్ ఆఫీస్, ఆర్ఎంఎస్ ఆఫీస్, ప్రయాణికుల లగేజీలను పరిశీలించారు. వారు ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్తున్నారో అడిగి తెలుసుకున్నారు. టిక్కెట్లు ఉన్నాయో లేదో పరిశీలించారు.



ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసుల తనిఖీలు

పనిచేయని ప్రింటర్లు..

- పేపర్లు లేవంటున్న డిజిటల్ అసిస్టెంట్లు
- ధ్రువపత్రాల కోసం లబ్ధిదారులకు ఇబ్బందులు

ఏలూరు రూరల్, జూన్8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణులకు అన్ని సేవలు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో సచివాలయాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 407 సచివాలయాలు ఉన్నాయి. లబ్ధిదారులకు కుల, నివాసం, ఆదాయం, జనన, మరణ, అడంగళ్ తదితర ధ్రువీకరణ పత్రాలు సచివాలయాల్లో అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. అయితే సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. పత్రాలు అందుబాటులో లేవని డిజిటల్ అసిస్టెంట్లు చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు ప్రైవేటు మీ సేవల ద్వారా ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారు.

నిత్యం ప్రింటర్లు మరమ్మతులే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రైతులు రుణాలు రెన్యువల్ చేయించుకోవడానికి వన్‌బీ, అడంగళ్, కుల ధ్రువీకరణ, నివాస పత్రాలకు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రింటర్లు మరమ్మతులకు గురికావడంతో ధ్రువీకరణ పత్రాలు ప్రైవేటు మీ సేవల్లో అధిక ధరలు ఇచ్చి తీసుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రింటర్లు మరమ్మతులను పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో సచివాలయ సేవలు ప్రజలకు దూరమవుతున్నాయి. త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నది. విద్యార్థులకు కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ అవసరమవుతాయి. వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వారికి ఇదే సమస్య ఎదురవుతోంది.

తీరనున్న మంచినీటి కష్టాలు



ఎర్రకాలువ జలాశయం

- జంగారెడ్డిగూడెంలో రూ.101.16 కోట్లతో ఏఐఐబీ పథకం
- ఎర్రకాలువ నుంచి పైప్‌లైన్ల ద్వారా శుద్ధి చేసిన నీరు తరలింపు

జంగారెడ్డిగూడెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం ప్రజల మంచినీటి కష్టాలకు ఎర్రకాలువ జలాశయం నుంచి పట్టణానికి వచ్చే మంచినీటి పథకంతో తీరనున్నాయి. పట్టణంలో పెరుగుతున్న జనాభా ప్రకారం ప్రతీరోజు పట్టణంలో 7.28 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) మంచినీటిని మున్సిపాలిటీ నుంచి అందించాల్సి ఉండగా ప్రస్తుతానికి 7.07 ఎంఎల్‌డీ నీటిని మాత్రమే అందజేస్తున్నారు. పట్టణంలో 33 మంచినీటి బోర్లు ఉండగా వీటిలో కేవలం ప్రభుత్వ కళాశాల వద్ద ఉన్న బోరు నుంచి వచ్చే నీరు (కాలేజీ వాటర్), జడ్పీ హైస్కూల్ వద్ద ఉన్న మంచినీటి బోరు నుంచి వచ్చే నీరు (హైస్కూల్ వాటర్) మాత్రమే ప్రజలు తాగుతున్నారు. మిగతా 31 బోర్ల నుంచి వచ్చే నీరు ఉప్పగా ఉండడంతో తాగడానికి ఉపయోగ పడవు. దీంతో ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల ద్వారా 20 లీటర్ల మంచి నీటిని రూ.10లకు కొనుక్కుని తాగుతున్నారు.

రూ.85.38 కోట్ల ఏఐఐబీ నిధులతో..

పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీటిని అందించడానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు నిధులు (ఏఐఐబీ) ద్వారా రూ.80.95 కోట్లు మంజూరు చేయగా ప్రస్తుతం ఈ ప్రాజెక్టు రూ.85.38 కోట్లతో రీ ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వ ఆమోదానికి పంపించారు. ప్రస్తుతం టెండరు దశలో ఉంది. ఈ రూ.85.38 నిధులకు మున్సిపాలిటీ నుంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెయింటెనెన్స్ నిమిత్తం ఏటా రూ15.78 కోట్లు జమ చేస్తారు. దీంతో ప్రాజెక్టు విలువ రూ.101.16 కోట్లకు చేరనుంది. ఎర్రకాలువ జలాశయం దగ్గరే రూ.53 కోట్లతో పంపింగ్ మెయిన్ ఏర్పాటు చేసి నీటిని శుద్ధి చేసి జంగారెడ్డిగూడెం వరకు పైప్‌లైన్ వేసి ప్రతీ ఇంటికీ శుద్ధి చేసిన నీరు ఇవ్వాలని సంకల్పించారు. దాదాపు ఐదు కిలోమీటర్ల మేర పట్టణంలో పైప్‌లైన్ వేశారు.

మున్సిపాలిటీకి రూ.3 కోట్ల ఆదా



ఏఐఐబీ పథకం ద్వారా పట్టణానికి మంచినీటిని అందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకం అమలైతే ఏటా విద్యుత్ మోటార్లకు వచ్చే కరెంటు బిల్లులు, మోటార్ల మరమ్మతుల కోసం ఖర్చు చేసే రూ.3 కోట్లు మున్సిపాలిటీకి ఆదా అవుతుంది. ఈ పథకంతో ప్రజలకు సురక్షితమైన శుద్ధి చేసిన మంచినీటిని అందజేయవచ్చు. ఎర్రకాలువ నుంచి వచ్చే పైప్‌లైన్ ద్వారా మంచినీటిని పట్టణంలో నిర్మించబోయే ఐదు మంచినీటి ట్యాం కుల నుంచి పైప్‌లైన్ ద్వారా పట్టణంలోని ఇళ్లకు పంపిస్తాం.

కేవీ రమణ, కమిషనర్, జంగారెడ్డిగూడెం

ఆన్‌లైన్ పెట్టుబడులంటూ.. రూ.69.30 లక్షలు కాజేశారు!

ఏలూరు క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వాట్సప్ ద్వారా ఒక లింకు పంపి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు అంటూ నమ్మబలికి ఒక గృహిణి అకౌంట్ నుంచి 69 లక్షల 30 వేల రూపాయలు వివిధ అకౌంట్లకు సొమ్ములను కట్టించుకుని లాభాలు రాలేదని ఉద్దేశ్యపూర్వకంగా మోసగించారంటూ బాధితురాలు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ గ్రీన్‌సిటీ ప్రాంతానికి చెందిన మెయిదా కృష్ణభవాని (30) గతంలో ఒక ప్రైవేటు స్కూల్‌లో పని చేశారు. ప్రస్తుతం గృహిణిగా ఉన్నారు. ఆమె వాట్సప్‌కు ఈ ఏడాది మే 19వ తేదీన అమాన్సా పిటి ప్రైవేట్ లిమిటెడ్ యాప్ నుంచి ఇన్వెస్ట్‌మెంట్ లింకు వచ్చింది. లింకు ఓపెన్ చేయగానే ఆమె ఫోన్ నెంబర్ మీద అకౌంట్ రిజిస్టర్ అయిపోయి మళ్లీ ఇంకో నంబర్ నుంచి అదే యాప్ డౌన్‌లోడ్ చేసి ఆ యాప్ నుంచి చాటింగ్ నిర్వహించారు. పలువురు పెట్టుబడులు పెట్టడం వల్ల ఎక్కువ లాభాలు పొంద వచ్చని చెప్పడంతో ఆమె నమ్మి ఆ లింకు ద్వారా యాప్‌ను ఓపెన్ చేసుకున్నారు. ఆ లింకు ద్వారా దఫదఫాలుగా రూ.69లక్షల 30 వేలు వివిధ అకౌంట్లకు కృష్ణభవాని చెల్లింపులు చేశారు. ఆ తర్వాత ఎలాంటి లాభాలు లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి ఏలూరు రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్‌కే దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



ఏలూరు డీఈవో కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బదిలీల సంక్షోభంపై మంత్రి లోకేశ్ జోక్యం చేసుకోవాలి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్

ఏలూరు అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల బదిలీల్లో నెలకొన్న సంక్షోభంపై విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ వెంటనే జోక్యం చేసుకుని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని ఏపీ టీచర్స్ అసోసియేషన్ జేఏసీ ఉమ్మడి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం డీఈవో కార్యాలయం వద్ద నిర్వహించిన ముట్టడి కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి మాట్లాడుతూ తాజాగా జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీల్లో పలు సమస్యలు కొనసాగుతున్నాయని, ముఖ్యంగా ఎస్జీటీ కేడర్ టీచర్లకు మాన్యువల్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని గతనెల 19, 20 తేదీల్లో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో జరిపిన చర్చల్లో విద్యాశాఖ కమిషనర్ హామీ ఇచ్చారని, దీనికి భిన్నంగా ఇపుడు బదిలీ స్థానాలకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వాల్సిందిగా వెబ్‌సైట్‌లో ఎనేబుల్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ నిర్ణయం ఉపాధ్యాయులను మోసం చేయడమేనని ఆరోపించారు. గతంలో జరిగిన వెబ్ ఆప్షన్లలో తలెత్తిన చేదు అనుభవాలను టీచర్లు ఇప్పటికీ మర్చిపోలేదని, మళ్లీ ఇపుడు అదే విధానాన్ని బలవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ మాన్యువల్ కౌన్సెలింగ్‌ను అనుసరించడానికి విద్యాశాఖకు ఎందుకు అభ్యంతరమో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వెబ్ ఆప్షన్లు ఇస్తే ఒక్కో ఎస్జీటీ సుమారు 2 వేలకుపైగా స్థానాలకు అభీష్టాన్ని తెలియ జేయాల్సి ఉంటుందన్నారు. ఇది తీవ్ర మానసిక ఒత్తిడికి దారితీస్తుందని వివరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్‌లో పెద్దసంఖ్యలో తప్పిదాలు వెలుగులోకి వచ్చాయని, వీటిని పరిష్కరించడానికి పెట్టిన అర్జీలను పట్టించుకునే వారేలేరని ఆరోపించారు. పికెటింగ్ అనంతరం డీఈవో వెంకట లక్ష్మమ్మను కలుసుకుని చర్చలు జరిపారు. బదిలీలపై సందేహాలను నివృత్తి చేయడానికి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ఏలూరు డీఈవో కార్యాలయంలో ఎవరిని సంప్రదించాలో అర్థంకాక అయోమయానికి గురవుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి భీమవరం డీఈవో కార్యాలయం నుంచి కొందరు సిబ్బందిని ఉమ్మడి జిల్లా డీఈవో కార్యాలయమైన ఏలూరులోని హెల్ప్‌డెస్క్‌కు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యేవరకు డిప్యుటేషన్లపై నియమించాలని ఎమ్మెల్సీ గోపిమూర్తి డీఈవోకు సూచించారు. యూటీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, అలీ, రవికుమార్, రామభద్రం, రాంబాబు, రంగమోహన్, శివశంకర్, మోహన్‌రావు, ఏపీటీఎఫ్ నాయకులు పట్టాభిరామయ్య, ఎస్టీయూ నుంచి శ్రీనివాస్‌వర్మ, రాజశేఖర్, క్రాంతికుమార్, ఏపీటీఎఫ్-1938 నాయకులు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ముందస్తు జాగ్రత్తగా డీఈవో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్జీటీలకు వెబ్ ఆప్షన్లే..

ఏలూరు అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ సాధారణ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న సెకండరీగ్రేడ్ టీచర్లకు (ఎస్జీటీ) వెబ్ ఆప్షన్ల విధానంలోనే ఆయా వెకెన్సీలకు అభీష్టాన్ని తెలియజేసే ప్రక్రియను విద్యాశాఖ ఆదివారం ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో 2 వేల మందికి పైగా ఎస్జీటీలు సాధారణ బదిలీలకు దరఖాస్తు చేసుకోగా,వీరిలో తొలి 500 మంది వెబ్‌ఆప్షన్లు ఇచ్చేందుకు ఆదివారం రోజంతా గడువునిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదేరీతిన వెబ్‌ఆప్షన్ల పద్ధతిని అనుసరిస్తున్నట్టు విద్యాశాఖవర్గాలు వెల్లడించాయి. సీనియార్టీ జాబితాల్లో తదుపరి మరో 500 మంది ఎస్జీటీలు అందుబాటులో వున్న వేకెన్సీలకు వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు ఆదివారం రాత్రి సమాచారం ఇచ్చే అవకాశం ఉందని వివరించాయి. రోజుకు 500 మంది చొప్పున వెబ్‌ఆప్షన్లు ఇచ్చేలా నిర్ణయించారు. కాగా ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు చేయాలని తమకు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి సమాచారం అందలేదని విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

రాష్ట్ర కార్యదర్శిగా మూడోసారి భూపతిరాజు రవీంద్రరాజు



ఏలూరు రూరల్ /భీమవరం టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా భూపతిరాజు రవీంద్రరాజు మూడోసారి ఎన్నికయ్యారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల కౌన్సిల్ సమావేశం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రవీంద్రరాజును నియమించారు. ప్రస్తుతం ఆయన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బంగారయ్య, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మోహనరావు, ప్రధాన కార్యదర్శి జకరయ్య, ఏలూరు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు సుబ్బారావు, రవికుమార్, అక్బర్, వెంకటేశ్వరరావు, అజయ్, అడపా రాంబాబు, పశ్చిమ గోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, కెనడీ, సత్తిబాబు, సురేష్, చెల్లయ్య, ముత్యాలు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, బి.సుగుణమ్మ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగసాయి అభినందనలు తెలియజేశారు.

అలరించిన శ్రమకావ్యం.. గానం



మాట్లాడుతున్న రచయిత సుద్దాల అశోక్ తేజ

ఏలూరు కార్పొరేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు టుబాకో మర్చంట్ అసోసియేషన్ హాలులో సీఐటీయు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ నిర్వహించిన 'శ్రమకావ్యం' గానం సభికులను ఆకట్టుకుంది. సమాజ పరిమాణం, అభివృద్ధిలో శ్రమ పాత్రే కీలకమైనదని అశోక్‌తేజ వివరించారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అధ్యక్షతన నిర్వహించిన శ్రమకావ్యం గాన సభలో రచయిత సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రమకావ్యం పుస్తకంలో అనేక ఘట్టాలను ఆలపిస్తూ సవివరంగా విశ్లేషించారు. శ్రమకావ్యం రచనలో శ్రమను వస్తువుగా తీసుకుని రచన చేయడం సాహసోపేతమని రిటైర్డ్ రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సంపద సృష్టికర్తలైన కార్మికుల శ్రమను తక్కువ చేస్తే కార్పొరేట్‌లే సంపద సృష్టికి మూలమని ప్రస్తుత పాలకులు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని సీఐటీయు దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తుందన్నారు.జూలై 9న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ సుద్దాల అశోక్‌తేజ అత్యంత సరళంగా సామాన్య పాఠకులకు అర్థమయ్యే విధంగా శ్రమకావ్యం రచించారని అన్నారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజూ)

ఉద్యోగావకాశాలు

Sunanda Group Conducting Recruitment drive QR Technicians : (1) ITI / Diploma : Electrical / Electronics / Mechanical, Engineers : (2) B.Tech / M.Tech : E.E.E / E.C.E / Mechanical, FRESHERS ALSO WELCOME Venue : Sunanda Renewable Energies Pvt.Ltd Banjarahills, Hyderabad. Email : hr@sunandagroups.com, 9542226777, 7207705666

AJG-2275

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారణలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్ కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపుటకు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - పబ్లిసిటీ



ప్రత్తిపాడు సాక్షి కార్యాలయం వద్ద సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న తెలుగు మహిళలు



ఆచంట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు



తణుకు పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళ నాయకులు

మహిళాగ్రహం

అమరావతి ప్రాంతంలోని మహిళలపై సాక్షి ఛానల్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలంటూ ఆదివారం ఉమ్మడి జిల్లా పరిధిలో పలు స్టేషన్లలో అనేకమంది ఫిర్యాదులు చేశారు. మహిళలను కించపరిచిన వారిని శిక్షించాలంటూ నిరసన ర్యాలీలు చేశారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, చింతలపూడి, లింగపాలెం, తణుకు, నరసాపురం, ఆచంట, ఆకివీడు పోలీస్‌స్టేషన్లలో మహిళలు ఫిర్యాదు చేశారు. పెంటపాడు సాక్షి కార్యాలయం వద్ద మహిళలు నిరసన తెలిపి ఆ పత్రిక ప్రతులను చించివేశారు.

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు

పెంటపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాజధాని మహిళలను కించపరుస్తూ మాట్లాడటం హేయమని జిల్లా తెలుగుదేశం పార్టీ తెలుగుమహిళా అధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం ప్రత్తిపాడు సాక్షి కార్యాలయం వద్ద తెలుగు మహిళలు నిరసన చేపట్టారు.తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దాసరి కృష్ణవేణి మాట్లాడుతూ రాజధానిపై అసభ్యకరంగా మాట్లాడిన కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై కేసు నమోదు చేయాలని, సాక్షి యాజమాన్యం క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం సాక్షి ప్రతులను దహనం చేశారు. తమరపు రమణమ్మ, రేవతి చిన్నా యమ్మ, స్వర్ణలత, వరలక్ష్మి , కొల్లి రమావతి తదితరులు పాల్గొన్నారు.

- **తణుకు** : అమరావతి ప్రాంత మహిళలనుద్దేశించి నీచంగా మాట్లాడిన పేటీఎం జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని తణుకు నియోజకవర్గ తెలుగు మహిళా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ కె.ప్రసాదు, ఏఎస్‌ఐ రాజ్యలక్ష్మిలకు ఫిర్యాదు చేశారు.
- **నరసాపురం టౌన్** : అమరావతి వేశ్యల రాజధాని అని మహిళల్ని కించపర్చుతూ సాక్షి మీడియాలో ప్రచారమైన డిబేట్‌పై టీడీపీ మహిళా విభాగం మండిపడింది. పార్టీ పట్టణ అధ్యక్షురాలు కొలిచెన పద్మ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సై జయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. పెమ్మాడి శశి, బేగం, నాగమణి, విజయలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.
- **ఆచంట** : అమరావతి రాజధానిపై మహిళలపై తప్పుడు వాఖ్యలు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆచంట పోలీసు స్టేషన్‌లో ఆచంట నియోకజవర్గ మహిళలు పిర్యాదు చేశారు. జర్నలిస్టులు, సాక్షి టీవీ చానల్ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మన్నె రాధిక, బీరా తిరుపతమ్మ, చిలుకూరి సత్యవతి, ఎం.విజయలక్ష్మి, కె.స్వర్ణకుమారి, వి.రాధా, కేతా అరుణ తదితరులు పాల్గొన్నారు.
- **పాలకొల్లు టౌన్** : పాలకొల్లు పట్టణంలోని తెలుగు మహిళలు పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. రాష్ట్ర మహిళలకు భారతిరెడ్డి, జగన్మోహనరెడ్డిలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ పృథ్వీకి ఫిర్యాదు అందజేశారు. పెండ్యాల భవాని, ఎస్తేరు రాణి, బేతు నాగలక్ష్మి, దేవగానుగుల వరలక్ష్మి, సంఘాల విజయలక్ష్మి, తాళ్లూరి విజయలక్ష్మి, తాళం అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.
- **ఆకివీడు** : రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడమంటే ఏపీ మహిళలందరినీ అన్నట్టేనని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.
- **ఏలూరు టూటౌన్** : వైసీపీ, సాక్షి మీడియా రాష్ట్ర మహిళల మనోభావాలతో దారుణంగా ఆడుకుంటుందని జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు సాక్షి దినపత్రిక కార్యాలయం వద్ద తెలుగు మహిళలు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల సునీత మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం ఇంత నీచానికి దిగజారిన జగన్ వైఖరిని రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ఖండించాలన్నారు. అనంతరం సాక్షిదినపత్రికను దహనం చేశారు.జిల్లా అధికార ప్రతినిధి కడియాల విజయలక్ష్మి, వై.శ్యామల, ఎం.రామతులసి, సంతోషి, వడ్డి వాసవిదేవి, వేముల రంగమ్మ, తవ్వా అరుణకుమారి, జే.వెంకటరమణ, ఉషారాణి, జయంతి, రమాదేవి, జానకి, సరిత, తదితరులు పాల్గొన్నారు. అనంతరం త్రిటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- **చింతలపూడి** : కూటమి ఆధ్వర్యంలో చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాటూరి వెంకట్రామయ్య, జనసేన అధ్యక్షులు చీదరాల మధుబాబు, బిజెపి పట్టణ అధ్యక్షురాలు విజయకుమారి, పట్టణ టీడీపీ అధ్యక్షులు తాటి అప్పారావులు ఫిర్యాదు చేయగా కూటమికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- **కామవరపుకోట** : తడికలపూడి పోలీస్‌స్టేషన్ వద్ద టీడీపీ నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. మండల తెలుగుదేశం అధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబుల ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు గొంతు వెంకటేశ్వరరావు, బొబ్బిలి డాన్ దివాకర్, మేరుగు సుందరరావు, యలమాటి నాగేశ్వరరావు, సూరం సుధీర్, బలుసు సాయి, కిరణ్, కొలుకులూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.
- **లింగపాలెం** : లింగపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గరిమల చలపతిరావు ఆధ్వర్యంలో ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు ఇళ్లలో కూడా ఆడవాళ్ళు ఉంటారనే విషయాన్ని వారు మర్చిపోయారా అంటూ నిలదీశారు. చెరువుగట్టు రామోహ్మన్‌రావు, మోరంపూడి ప్రసాద్, పల్లి శ్రీను, గజ్జ వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ సుధాకర్ పాల్గొన్నారు.
- **జంగారెడ్డిగూడెం** : సాక్షి టీవీ ఛానెల్లో అమరావతి మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడి అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జబీర్‌కు కూటమి మహిళలు ఆదివారం ఫిర్యాదు చేశారు.కూటమి మహిళలు పీసుపాటి రామలక్ష్మి, పగడం సౌభాగ్యవతి, గురుజు ఉమామహేశ్వరి తెలగారపు జ్యోతి, గుళ్లపూడి శ్రీదేవి, మారిశెట్టి బాల చిట్టెమ్మ, రాజీ, టి.సుమలత, నాయకులు చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, పాతూరి అంబేద్కర్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, రమేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని లక్కవరం పోలీస్ స్టేషన్‌లో మహిళలు ఫిర్యాదు చేశారు.
- **కొయ్యలగూడెం** : అమరావతి రాజధాని మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, రాష్ట్ర మహిళా కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ, మండల మహిళా ప్రధాన కార్యదర్శి రమాదేవి, మండల మహిళా అధ్యక్షురాలు ఆకుల అరుణ, కొత్తా రమా, ఆరేటి వీరపండు, బొబ్బర రాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై విష ప్రచారమా ?

భీమవరం క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలను కించపరుస్తూ అమరావతి వేశ్యల రాజధానిగా వ్యాఖ్యానించిన వారిని కఠినంగా శిక్షించాలని భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు టీడీపీ మహిళలు, నాయకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ అమరావతి రాజధాని మహిళలు, ప్రజలను కించపరుస్తూ సాక్షి టీవీలో మాట్లాడిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాస్, సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు. అమరావతి ప్రాంతంపై మితిమీరిన విద్వేషంతో వైసీపీ నాయకులు సైకోలుగా మారి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ సాక్షి టీవీ డిబేట్‌లో అమరావతి మహిళలను, ప్రజలను అవమానపరిచేలా మాట్లాడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ఇంటితోపాటు రాష్ట్రంలో ప్రముఖ నాయకుల గృహాలన్నీ అమరావతి ప్రాంతంలోనే ఉన్నాయని గుర్తు పెట్టుకోవాలన్నారు. టీడీపీ కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భీమవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు మద్దుల రాము మాట్లాడుతూ చరిత్ర తెలియని అజ్ఞానంతో అమరావతిపై ఇష్టారీతిన దుష్ప్రచారం చేయిస్తున్నారని, వైజాగ్‌లో భూములు కొట్టేసినట్లుగా అమరావతిలో కొట్టేయడానికి వీలు పడకపోవడంతో అమరావతిపై కక్షకట్టి జగన్ ఇలా ప్రవర్తిస్తున్నారన్నారు. తెలుగు మహిళా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాదాసు కనకదుర్గ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మద్దుల రాము, ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, భీమవరం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కోళ్ళ సీతారాం, టీడీపీ నాయకులు మెంటే గోపి, ఎద్దు ఏసుపాదం, మైలాబత్తుల ఐజాక్‌బాబు నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ధర్మాజీగూడెంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు, మహిళలు



జంగారెడ్డిగూడెం ఎస్సై జబీర్‌కు ఫిర్యాదు అందిస్తున్న కూటమి మహిళలు



కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

శుభకార్యాలకు బ్రేక్

రేపటి నుంచి మూఢం..

రానున్న నెలన్నర విశ్రాంతి

ద్వారకాతిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్ల సీజన్‌లో గురుమౌఢ్యమి జొరపడటంతో కొన్నాళ్లు వివాహాది శుభకార్యాలకు బ్రేక్ పడనుంది. దీంతో శుభ కార్యాల్లో సందడి చేసే డోలు, సన్నాయిలు మూగ బోనున్నాయి. మాంగల్యం తంతునానేనా... అంటూ పెళ్లి మంత్రాలు చదివే పురోహితులు రానున్న నెలరోజుల పైబడి మౌనవ్రతం చేపట్టాల్సిందే.. వంటమేస్త్రి, పూల అలంకరణ చేసేవాళ్లు, కాటరింగ్ సిబ్బంది, లైటింగ్ డెకరేషన్ వారు, కల్యాణమండపాల యజమానులు ఈ కొద్దిరోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సిందే. ఈనెల 10న గురుమౌఢ్యమి ప్రవేశించడంతో పాటు 26 నుంచి వచ్చేనెల 24 వరకూ ఆషాడమాసం శూన్యమాసం కావడంతో దాదాపు నెలన్నర పాటు శుభకార్యాలకు బ్రేక్ పడనుంది.

అట్టహాసంగా పెళ్లిళ్లు

చినవెంకన్న ఆలయ పరిధిలో ఈ జ్యేష్ఠమాసంలో ఆఖరి ముహూర్తం కావడంతో ఆదివారం ఉదయం నుంచి పెళ్లిళ్లు ఎక్కువగానే జరిగాయి. ఆలయ అనివేటి మండపం, ఆలయ పాత కల్యాణమండపం, పలు ప్రైవేటు కల్యాణమండపాలు వివాహాది శుభకార్యాలకు వేదికలయ్యాయి. రాత్రి సైతం వివాహాలు జరగడంతో క్షేత్రంలో పెళ్లిసందడి నెలకొంది.

ముంచుకొస్తున్న మూఢమి

ఈనెల 10 నుంచి వచ్చేనెల 8 వరకూ గురు మౌఢ్యమి కావడంతో వివాహాది శుభకార్యాలు జరుగవని పురోహితులు గోవిందవఝుల వెంకట రమణమూర్తిశర్మ చెబుతున్నారు. ఈ జ్యేష్ఠమాసంతో మూఢమి రాకుంటే మరో 15 రోజులు పాటు వివాహాది శుభకార్యాలు జరిగేవి. అయితే మూఢమి జొరపడటంతో ఇలా పెళ్లిళ్లు లేనట్టేనని వివరించారు. ఆ తరువాత ఆషాడ మాసం రావడం అది శుభకార్యాలకు శూన్యమాసం కావడంతో వచ్చేనెల 26 నుంచి శ్రావణమాసంలో వివాహాలు, ఇతర శుభకార్యాలు ప్రారంభమవుతాయని శర్మ వివరించారు.



పాత కల్యాణ మండపంలో వివాహ సందడి



ద్వారకా తిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులు

కిటకిటలాడిన చిన్న తిరుపతి

ద్వారకాతిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న క్షేత్రం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. సెలవు రోజు కావడంతో ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. మొక్కుబడులు తీర్చుకుని స్వామి దర్శనానికి బారులు తీరారు. శ్రీవారిని దర్శించేందుకు సామాన్య భక్తులకు దాదాపు రెండు గంటల సమయం పట్టింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం లైన్లలో ఉన్న భక్తులకు సేవాదళం సభ్యులు మంచినీరు అందజేశారు. దాదాపు పది వేల మందికి పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

మృగశిర కార్తె..మార్కెట్‌లో జోరుగా చేపల విక్రయాలు



గణపవరం మార్కెట్‌లో జోరుగా చేపల విక్రయాలు

గణపవరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా గణపవరంలో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. ఆదివారం నుంచి మృగశిర కార్తె ప్రవేశించిన సందర్భంగా ఒక పక్క రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. పుడమితల్లికి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. మరోపక్క మృగశిర కార్తె రోజున చేపలు తినాలనే ఆనవాయితీ ఉండటంతో చేపలు కొనుగోలుకు ఎగబాకారు. అయితే ఈ చేపలు తినాలనే సంప్రదాయం వెనుక ఎన్నో ఆరోగ్య రహస్యాలు ఉన్నాయని చెబుతున్నారు. మృగశిర కార్తెలో రుతుపవనాల రాకతో వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుంటాయని ఈ చేపలు తినడంలో ఆరోగ్య సూత్రాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా జలుబు, ఉబసం, దగ్గు, ఆస్మా వంటి తదితర వ్యాధులు మృగశిర కార్తెలోనే ప్రారంభమవుతాయని అంటారు. చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ డి, ప్రోటీన్లు, జింక్, ఐరెన్, ఐయోడిన్ వంటి లవణాలు మానవశరీరంలో రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయని పెద్దలు చెబుతున్నారు. దీంతో మృగశిర కార్తె రోజున చేపలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. శిలావతి రూ.160 - 170, కట్ల రూ.150, గడ్డిచేప కిలో రూ.180-200, కొర్రమేను రూ.300-350 చొప్పున విక్రయించారు దీంతో గణపవరం చేపల మార్కెట్‌లో విక్రయాలు జోరుగా సాగాయి. వినియోగదారులతో మార్కెట్‌లు కళకళలాడాయి.

రైలు ఢీకొని ఒకరి మృతి

భీమవరం క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : బహిర్భూమికి వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొన్న ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందినట్టు రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. వీరవాసరం మండలం పెర్కిపాలెం గ్రామానికి చెందిన కందుకూరి ఏడుకొండలు (46) ఆదివారం ఉదయం సమీపంలోని రైలు పట్టాలపై బహిర్భూమికని వెళ్తున్నాడు. అయితే ఆ సమయంలో వస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం



పాలకొల్లు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు 5వ వార్డు ఆంబోతుల వారి వీధిలో గుర్తు తెలియని 70 సంవత్సరాల వయసు ఉన్న వృద్ధుడి మృత దేహాన్ని స్థానికులు గుర్తించి 108కి సమాచారం అందించారు. పాలకొల్లు పట్టణ పోలీసులకు సమాచారం అందించగా పట్టణ సీఐ కె.రజనికుమార్ ఆదేశాలు మేరకు ఎస్‌ఐ జి.పృథ్వీ మృతదేహాన్ని స్థానిక పాలకొల్లు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

వీరవాసరం (భీమవరం టౌన్) జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం మండలం అండలూరు గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. కాళ్ళమండలం బొండాడ గ్రామానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై అండలూరు వద్ద చర్చి టర్నింగ్ తిరుగుతుండగా ఓ లారీ ఢీకొనడంతో చిట్టజల్లి సత్యవతి (30) అక్కడికక్కడే మృతి చెందింది. భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. భార్యభర్తలు ఇరువురు వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రేపు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా

ఏలూరుకార్పొరేషన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ పేదల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ 10న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహించనుంది. ఈ మేరకు అధికారులకు వినతులు అందజేయాలని నిర్ణయించినట్టు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉపాధి పథకం సక్రమంగా అమలు చేయాలని, తదితర సమస్యలపై ధర్నా నిర్వహిస్తున్నట్టు వెంకటేశ్వరరావు తెలియజేశారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవాలు

చింతలపూడి, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : ఎర్రగుంటపల్లిలో సంతాన వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త చంద్రగిరి శేషకిరణ్ తెలిపారు. 9, 10, 11 తేదీల్లో ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆలయాల్లో దేవతా విగ్రహాలకు అర్చనలు, అభిషేకాలు, పడి పూజ నిర్వహిస్తారు. 11న అన్నసమారాధన, రాత్రి శాంతి కల్యాణం జరుపుతారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

నేత్రపర్వంగా సుందరగిరిపై సుదర్శన హోమం



ద్వారకాతిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఐ.ఎస్.జగన్నాథపురంలో కొలువుదీరిన లక్ష్మీనారసింహుని ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం విశేష కార్యక్రమాలు జరిగాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో సుందరీకరించిన యాగశాలలో పుణ్యాహ వాచన, కలశస్థాపన నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల నడుమ శ్రీసుదర్శన నృసింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ అనంత మూల మంత్రహోమం జరిగింది. ఆ తరువాత మూలవిరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు.

జిల్లాలో విజిబుల్ పోలీసింగ్

ఏలూరు క్రైం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతి వేగంగా వాహనాలు నడపవద్దని, కార్లు నడిపేవారు సీటు బెల్టులు ధరించాలన్నారు. ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని సూచించారు. ప్రస్తుతం ఉన్న మోటారు వాహన చట్ట ప్రకారం ఎక్కువ జరిమానాలు ఉన్నాయని దీనిని దృష్టిలో పెట్టుకుని జరిమానాలు బారిన పడకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మ వారిని దర్శించుకుని, పూజలు జరిపారు. భక్తులు అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీశ్ కుమార్ తెలిపారు.

యువకుల రక్తదానం

ఏలూరు క్రైం, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : ఈనాడు పత్రిక వ్యవస్థాపకులు చెరుకూరి రామోజీరావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన అభిమానులు ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ పీఆర్వో రమణ మాట్లాడుతూ రామోజీరావు వర్ధంతిని పురస్కరించుకుని రక్తదానం చేయడం అభినందనీయమన్నారు.

అలరించిన బాలు పాట బాలల నోట



ఏలూరు రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు వక్తలు కొనియాడారు. ఎస్‌పీ ఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఏలూరు వైఎన్‌హెచ్‌ఏ హాలు ప్రాంగణంలో ఎస్‌పీఎస్ అకాడమీ చిన్నారులచే బాలు పాట-బాలల నోట సంగీత విభావరి నిర్వహించారు. తొలుత ఎస్పీ బాలు చిత్రపటానికి నివాళులర్పించారు. అతిథులు మాట్లాడుతూ బాలు తన గాత్రంతో వేలాది పాటలకు ఊపిరి పోశారని కళాకారుల ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహిస్తున్న ఎస్‌పీఎస్ అకాడమీ నిర్వాహకులు ఎస్పీఎస్ వాసును అభినందించారు. ఏర్పాట్లను వహిదా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కల్చరల్ డైరెక్టర్ ఆర్.మల్లికార్జున్‌ను సత్కరించారు.

అమ్మవార్ల జాతర నిర్వహణపై సమావేశం

ఏలూరుకార్పొరేషన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తూర్పువీధి గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజుబాబుల జాతరను ఈ ఏడాది నిర్వహించేందుకు నాయకులు తీర్మానించారు. ఆదివారం జాతర కమిటీ నాయకులు వంకినేని భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించి చర్చించారు. భాను ప్రకాశ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జాతరకు సంబంధించి 49 ఆలయాలు జియోటాగింగ్ చేసినట్టు తెలిపారు. జాతర జరిగే తేదీలు ఎమ్మెల్యే బడేటి చంటితో చర్చించి తూర్పు వీధి గంగానమ్మ ఆలయంలో మరోసారి అన్ని వర్గాలతో చర్చించి తేదీని ప్రకటిస్తామన్నారు. వంకినేని సాయిబాబా, ఆహ్లాద్, వేగుంట ప్రసాద్, ఆనంద కుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గోపన్నపాలెంలో పేద కుటుంబానికి చేయూత సాయం

దెందులూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న గోపన్నపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి కుమారికి నిత్యావసర సరుకులు, కొంత నగదును అందజేసినట్టు చేయూత సంస్థ సభ్యులు మేకా లక్ష్మీనారాయణ, ఎం.నాగార్జున తెలిపారు. ఆదివారం గోపన్నపాలెం వెళ్లి కుమారికి వీటిని అందజేశామన్నారు. చేయూత సంస్థ సభ్యులు ఎం.లక్ష్మణరావు, ఏనుగు రామకృష్ణ, తాతా సురిబాబు, వి.రాజేంద్ర, ఇ.శరత్, జి.దుర్గారావు, ఆర్.మహేష్ ఉన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



జాహ్నవి, మణికంత, సాయిరామ్, జశ్వంత్, హాసిని

పెదవేగి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పెదవేగిలోని ఎస్ఎంసీ హైస్కూల్లోని టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు లభించాయి. ఏడుగురు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు రాగా, అందులో మూడు పెదవేగిలోని ఎస్ఎంసీ హైస్కూల్ విద్యార్థులే దక్కించుకోవడం గమనార్హం. పెదవేగి ఎస్ఎంసీ హైస్కూల్ విద్యార్థులు తాతా జాహ్నవి (580), బొల్లా జస్వంత్(578), కొడవళ్ల హాసిని (574), గంగన్నగూడెం శివారు శ్రీసాయి హైస్కూల్ విద్యార్థి వీఎస్ఎస్.మణికంత (580), జానంపేట సెయింట్ లూసీ హైస్కూల్ విద్యార్థి సాయిరామ్(578), వేగివాడ సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థి జొన్నకూటి అనిత(570), విజయరాయి సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థి బోడా రాహుల్ నాయక్(544) ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్, ఎంఈవో- 1 సబ్బితి నరసింహమూర్తి, ఎంఈవో-2 వి.అరుణ్ కుమార్, హెచ్ఎంలు, కరస్పాండెంట్లు అభినందించారు.

శ్రీవారిని దర్శించిన బాలనటుడు బుల్లిరాజు



ద్వారకాతిరుమల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి వస్తున్నాం సినిమా ద్వారా పేరొందిన బాలనటుడు బుల్లిరాజు(రేవంత్) ఆదివారం రాత్రి చినవెంకన్నను దర్శించుకున్నాడు. కుటుంబ సమేతంగా వచ్చిన బుల్లిరాజు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నాడు. అతన్ని గుర్తించిన యాత్రికులు, దేవాలయ సిబ్బంది బుల్లిరాజుతో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు.

అంతన్నారు..ఇంతన్నారు!

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు సంసిద్ధం కాలేకపోయారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడు నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కనీసం ఇప్పుడైనా టిడ్కో ఇళ్లు పూర్తవుతాయని, అవి కాస్త తమ సొంతం అవుతాయని లబ్ధిదారులు వేయి కళ్లతో ఎదురుచూస్తునే ఉన్నారు. ఇంకోవైపు టిడ్కో గృహ ప్రాంగణం ఇప్పటికే అత్యంత దీనావస్థలో ఉంది. ఇనుప చువ్వలు తుప్పుపట్టాయి. కట్టిన గోడలు నాచుపట్టాయి. విషపు పురుగులకు ఆలవాలంగా మారాయి. ఇంకోవైపు ఇలాంటి పరిస్థితే జంగారెడ్డిగూడెం టిడ్కోలోనూ కనిపిస్తోంది. ఇక్కడ 864కు పైగా గృహాలను మంజూరు చేస్తే వాటిలో 804 మాత్రం నిర్మాణాలకు దిగారు. కానీ ఏ ఒక్కటి పూర్తి చేయలేకపోయారు. బీసీ కేటగిరుల కింద మాత్రమే ఇక్కడ ఇళ్లను పేదలకు కేటాయించారు. 2018లో ఈ ఇళ్లకు శంకుస్థాపన జరిగినా, ఇప్పటికీ అతీగతీ లేదు.

ఇంకెప్పుడిస్తారు సార్ : జగన్ ప్రభుత్వం ఎలాగు చేయలేకపోయింది. అధికార పగ్గాలు చేజిక్కుంచుకున్న తెలుగుదేశం ప్రభుత్వం అయినా తొలి ఏడాది నిర్మాణాలు పూర్తి చేసి తామంతా గృహ ప్రవేశాలకు అవకాశం కల్పిస్తారని పేదలంతా ఎదురు చూశారు. ఏడాది పొడవునా ఎక్కడా పనులు ఆరంభం కాలేదు. గత ఐదేళ్లలో ఉన్న స్థితిగతులే కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా వీటి విషయంలో కలుగజేసుకుంటారా?లేదా అని ఇప్పటికే లబ్ధిదారులు కాస్తంత ఆగ్రహంతో ఉన్నారు.

సేవలకు సౌకర్యాల లేమి..

అసంపూర్తిగా సచివాలయాల భవనాలు
నిర్మాణాలు పూర్తి చేయాలంటూ ప్రజల విజ్ఞప్తి

జీలుగుమిల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన సచివాలయాల భవన నిర్మాణాలు చాలా వరకు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వీటిని పూర్తిస్థాయిలో నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా పరిశీలిస్తే 11 పంచాయతీల్లో సచివాలయ, రైతు సేవా కేంద్రాల భవనాల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, వంకవారిగూడెంలో పి.రాజవరం గ్రామాల్లోని భవనాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామయ్యపాలెం, స్వర్ణవారిగూడెం, పి.అంకంపాలెం, ములగంపల్లి భవన నిర్మాణాలు పూర్తయినా పంచాయతీ అధికారులకు వాటిని అప్పగించలేదు..దర్భగూడెం, రాచన్నగూడెం, అంకన్నగూడెంలోని నిర్మాణాలు పూర్తవడంతో నూతన భవనాల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం విధులు నిర్వహించే జీలుగుమిల్లి సచివాలయ పాత భవనం కొద్దిపాటి వర్షానికే గోడలు, పైకప్పు చెమ్మగిల్లి మరమ్మతులకు గురికావడం గమనార్హం. సచివాలయ భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్న విషయమై ఎంపీడీవో టి.నిఖిల్ మధుశరణ్‌ను వివరణ కోరగా కొన్ని బిల్లుల పెండింగ్ ఉన్నాయని, మరికొన్ని సంబంధిత కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే పనుల్లో పురోగతి సాధించలేదన్నారు.



జీలుగుమిల్లిలో అసంపూర్తిగా నిలిచిన సచివాలయం, రైతు సేవా కేంద్రం భవనం

కోకో గింజల చోరీ ముఠా అరెస్టు



పట్టుబడిన దొంగలతో పోలీసులు

జంగారెడ్డిగూడెం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన కోకో గింజలను దొంగిలించుకుపోతున్న నలుగురు ముఠా సభ్యులను జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయంలో యు.రవిచంద్ర విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ కేసుల్లో నలుగురిని అరెస్టు చేసి వారినుంచి రూ.8 లక్షల విలువైన చోరీసొత్తు స్వాధీన పరుచుకుని ఆటోను సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు.మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. ఆరుగురు ముఠాగా ఏర్పడి పథకం ప్రకారం ఈ చోరీలకు పాల్పడినట్టు డీఎస్పీ తెలిపారు. మండలంలోని చక్రదేవరపల్లికి చెందిన కంకిపాటి కీర్తి రాజు, మానికల మంగరాజు, దొప్పసాని వెంకన్నబాబు, పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన కటారి సుబ్రహ్మణ్యం, పరారీలో ఉన్న మరో ఇద్దరు మొత్తం ఆరుగురు కలిసి మండలంలో పలు చోట్ల కోకో గింజలు దొంగతనానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. వీరిలో కంకిపాటి కీర్తిరాజు పగలు మేకలు కాస్తూ రైతులు ఆరబెట్టిన కోకో గింజలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి మిగతా ముఠాకు సమాచారమిస్తాడు. వీరంతా కలిసి పథకం ప్రకారం ఆటోలో కోకో గింజలు వేసుకుని మూడో కంటికి కనపడకుండా పరారవుతారు. ఆ గింజలను రహస్యప్రదేశంలో దాచిఉంచి సరైన సమయం చూసుకుని అమ్ముతారు. ఆదివారం దొంగిలించిన 2వేల కిలోల కోకో గింజలను అమ్ముతుండగా ఎస్సై ఎస్.కె.జబీర్ తన సిబ్బందితో వెళ్లి నలుగురిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. కొద్దినెలలుగా టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, తడికలపూడి, ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ల పరిధిలో వీరిపై కోకో గింజల దొంగతనాలపై కేసులు నమోదైనట్టు డీఎస్పీ తెలిపారు. ఈ కేసు త్వరితగతిన ఛేదించిన ఎస్.ఐ.జబీర్, ఎ.ఎస్.ఐ. సంపత్ కుమార్, పీసీలు రమేశ్, రాజశేఖర్‌లకు రివార్డుల కోసం జిల్లా ఎస్పీకి సిఫారసు చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి జూన్ 8(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పింఛన్ల పంపిణీ పారదర్శకంగా ఉంటుందన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో ఆదివారం పలువురు ప్రజలు పింఛన్లు ఇప్పించాలని, ఇంటి రుణాలు మంజూరు చేయించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలను అందించడంలో ముందుంటుందన్నారు. పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్ ప్రసాద్, తాతా సత్యనారాయణ, ఈడ్పుగంటి అనిల్, మోరు శ్రావణి, మంచినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పెదవేగి జడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు



కన్నాపురం జడ్పీహైస్కూల్లో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెదవేగి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2008- 09 విద్యా సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఒక చోటకు చేరి ఆటపాటలతో సరదాగా గడిపారు. 16 ఏళ్ల తరువాత తాము చదివిన పాఠశాలలో కలుసుకోవడంతో చిననాటి జ్ఞాపకాలను తలుచుకుని మైమరచిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను గుర్తుంచుకుని, వారిని ఘనంగా సత్కరించారు.

● కొయ్యలగూడెం: కన్నాపురం జడ్పీపీ పాఠశాలలో 1998 - 99 సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులంతా సమావేశమయ్యారు. తమకి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, తదితర ముఖ్య పట్టణాల నుంచి కూడా వచ్చి అంతా కలుసుకున్నారు.

మ్యారేజ్ మీడియేటర్స్ ఐక్యంగా ఉండాలి : చంటి



సమావేశంలో పాల్గొన్న మ్యారేజ్ మీడియేటర్స్

ఏలూరు రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మ్యారేజ్ మీడియేటర్స్ ఐక్యంగా ఉంటూ ఒకరికొకరు సహాయ సహకారాలు అందజేసుకుంటూ ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం సమీపంలో స్వర్ణాంధ్ర మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జేఏసీ రాష్ట్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని ఆదివారం బడేటి చంటి, జనసేన నాయకులు నారా శేషు ప్రారంభించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ మీడియేటర్స్ సభలు సమావేశాలు నిర్వహించుకునేందుకు స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. మ్యారేజ్ మీడియేటర్స్ సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మ్యారేజ్ మీడియేటర్స్ సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. స్వర్ణాంధ్ర మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ ఏపీ జేఏసీ అధ్యక్షుడు తారక రామారావు, గౌరవ అధ్యక్షుడు సంది సూర్యచంద్రరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడు కోడే బాబూరావు, కోశాధికారి సుంకర గురునాథరావు, మహిళా విభాగం చైర్మన్ ఎరపతినేని శ్రీభారతి పాల్గొన్నారు.

ఆయిల్ పాం రైతు సమస్యలపై నేడు ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరుకార్పొరేషన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పాం రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌పై పది శాతం దిగుమతి సుంకాన్ని తగ్గించడం పట్ల సోమవారం ధర్నా నిర్వహించనున్నారు.ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆయిల్ పాం రైతులతో ధర్నాతో పాటు రైతుల సామూహిక రాయబార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆదివారం పవరుపేటలోని అన్నేభవనం వద్ద ఏపీ రైతు సంఘ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.శ్రీనివాస్ మాట్లాడుతూ పామాయిల్ దిగుమతులపై సుంకం తగ్గిస్తే స్థానిక రైతుల దిగుబడులకు ధర తగ్గి నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల రీత్యా టన్ను ఆయిల్‌పాం గెలలకు 22 వేలు మద్దతు ధర ఇవ్వాలని కోరారు. ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం 50 శాతం పెంచాలని, ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారం ప్రైవేటుపరం చేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఆయన వెంట రైతు సంఘ నాయకులు కట్టా భాస్కరరావు, కోన శ్రీనివాసరావులు ఉన్నారు. సోమవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

చరిత్రలో ఆదిజాంబవంతుల పాత్ర కీలకం : డొక్కా




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా

ఉంగుటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆది జాంబవంతులు చరిత్రలో కీలక పాత్ర వహించారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు.ఆదివారం ఉంగుటూరు మండలం కైకరం పెద్దిరెడ్డి శేషవేణి, వేణు కల్యాణ మండపంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆది జాంబవంతుల పరియోజన (గోదావరి, విజయవాడ, గుంటూరు విభాగాలు)సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తొలుత ఆది జాంబవంతుల వంశీకుల చరిత్రతో పాటు సమాజంలో పాత్రపై వివరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా వరప్రసాద్ హాజరై మాట్లాడుతూ సమాజంలో ఆది జాంబవంతుల స్థితిగతుల గురించి వివరించి చేతివృత్తుల ద్వారా వర్గాలుగా విభజింపబడ్డారన్నారు. డాక్టర్ టి.ఎస్.వంశతిలక్, ప్రొఫెసర్ వెంకట నరసయ్య(ఆది జాంబవ చారిత్రక పరిశోధకులు), తాళ్లూరి విష్ణువు, ప్రాంత ప్రముఖ్ కొండారెడ్డి, తులసి సూర్య ప్రకాష్, ముద్దు సాయిరాం, తోట జగన్నాథ్ ఆది జాంబవంతుల చరిత్ర, హిందువుల పండుగల ప్రాముఖ్యత గురించి వివరించారు.

కార్మిక చట్టాల మార్పులపై ఆందోళన

ఏలూరుకార్పొరేషన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకురావడం సరికాదని, తక్షణమే పది గంటల పని విధానాన్ని ఉప సంహరించుకోవాలని కోరుతూ సీపీఐ, ఏఐటీయూసీల సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. పని గంటల విధానానికి సంబంధించిన ప్రతులను దహనం చేశారు. కార్పొరేట్ శక్తుల కోసమే కార్మిక హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ నాయకులు కృష్ణమాచార్యులు, రెడ్డి శ్రీనివాసడాంగే, పళ్నం కిషోర్, కన్నయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

యోగాను ప్రజల్లోకి తీసుకెళ్తాం : ఎమ్మెల్యే

ఏలూరుటూటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యహితమైన యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శ్రీరామ్‌నగర్‌లోని శ్రీశ్రీవిద్యాలయ విద్యాసంస్థల ప్రాంగణంలో యోగాంధ్రను నిర్వహించారు. ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరియ్య విశ్వవిద్యాలయ రాజయోగా మెడిటేషన్ సెంటర్, టీమ్ ఫర్ గుడ్‌గవర్నెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ శారీరక, మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరు యోగాను ఆచరించాలని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరరావు, శ్రీశ్రీవిద్యాసంస్థల అధినేత ఎంవీఎస్.శర్మ, రాజయోగిని లావణ్య, శివరామకృష్ణ పాల్గొన్నారు.



ఏఐటీయూసీ మహాసభలో మాట్లాడుతున్న లలిత

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

వేలేరుపాడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్కీంవర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి కనీస వేతనం రూ.32 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ సంస్థ, స్కీమ్‌వర్కర్ల సంఘం రాష్ట్ర నాయకురాలు జే.లలిత డిమాండ్ చేశారు. ఆదివారం కన్నాయిగుట్టలో స్కీమ్ వర్కర్ల మండల మహాసభను నిర్వహించారు. స్కీమ్‌వర్కర్ల సమస్యలపై జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్టు తెలిపారు. స్కీమ్‌వర్కర్ల సమస్యలపై ప్రభుత్వం ఆయా సంఘాల నేతలను పిలిపించి మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని లలిత కోరారు.

స్కీంవర్కర్ల నూతన కమిటీ ఎంపిక

స్కీంవర్కర్ల మండల కమిటీ కన్వీనర్‌గా కౌలూరి సైదా కోకన్వీనర్లు సి.హెచ్.రమాదేవి, కె.వెంకటలక్ష్మి, కె.కుమారి, సీతామహాలక్ష్మి, రేవతిలను ఎన్నుకోగా మరో 20మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా కారం దారయ్యను నియమించారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మున్నీర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జిబాబు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఏఐటీయూసీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజమ్మ పాల్గొన్నారు.

13న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

జంగారెడ్డిగూడెం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ పిలుపునిచ్చారు. ఆదివారం ధర్మన్న మెమోరియల్ హాల్లో ఐఎఫ్‌టీయూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మంచిలి రాజు, తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, మొల్లేటి శ్రీనివాస్, కె.రామలక్ష్మి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి):గొల్లగూడెం సెక్షన్ కైకరం సబ్‌స్టేషన్ పరిధిలో రామన్నగూడెం నూతన లైన్ల ఏర్పాటు నిమిత్తం మంగళవారం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈ.ఈ.అంబేడ్కర్ వివరించారు.

సూర్యనారాయణ స్వామికి పూజలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఆదివారం భక్తులు స్వామికి సామూహికంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణ లు నిర్వహించి సూర్య నమస్కార పూజలు జరిపారు. ఆలయార్చకులు పూజలు నిర్వహించారు.

ముగిసిన గంగానమ్మ జాతర

ఉంగుటూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వెల్లమిల్లి గ్రామదేవత జాతర ఆదివారంతో ముగిసింది. శనివారం రాత్రి అమ్మవారిని పుర వీధుల్లో గరగ నృత్యాలు, బాణసంచాతో పాటు తీన్మార్ డప్పులతో ఊరేగించారు. ఆదివారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.తపన ఫౌండేషన్ అధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, భీమరాజు పాల్గొన్నారు.

నేడు యోగాంధ్ర ర్యాలీ

ఏలూరుటూటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర ర్యాలీ సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ ఇండోర్ స్టేడియం వరకు సోమవారం ఉదయం 6.30 నుంచి ఇండోర్ స్టేడియం వరకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ భాను ప్రతాప్ తెలిపారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

భీమడోలు, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటిస్తూ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పంటలు పండించి దిగుబడులు సాధించాలని భీమడోలు ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి అన్నారు. భీమడోలు రైతు సేవా కేంద్రం-1లో ఆదివారం కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ స్థాయిలో ఉద్యమంలా నిర్వహిస్తున్న సందర్భంగా భీమడోలులో ఏర్పాటు చేసిన సమావేశానికి కృషి విజ్ఞాన కేంద్రం నుంచి శాస్త్రవేత్త పి.విజయలక్ష్మి, డాక్టర్ రామచంద్రుడు హాజరై వరిలో రకాలు, డ్రోన్‌తో పురుగు మందుల పిచికారి, తేనెటీగల పెంపకం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏలు లలిత సుధ, ఉషారాణి, ప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రిక్వెస్ట్ బస్టాప్ పట్ల హర్షం

ఏలూరు రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం రోడ్డులో ఏపీఎస్ ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసింది. బస్సు ప్రయాణికులు మెయిన్ రోడ్డు నుంచి లునానీ నగర్, నేతాజీ నగర్, బీడీ కాలనీ వాసులు కాలనీలోకి రావడానికి వీలుగా రిక్వెస్ట్ స్టాప్ కావాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈ మేరకు విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడుకు రెండు వారాల క్రితం వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన చొరవతో లునాని నగర్‌లో రిక్వెస్ట్ స్టాప్‌ను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బస్సులు పాతబస్టాండ్‌కు నడపాలి

చింతలపూడి, జూన్ 8(ఆంధ్రజ్యోతి) :జంగారెడ్డిగూడెం నుంచి టి.నర్సాపురం మీదుగా చింతలపూడి వచ్చే ఆర్టీసీ బస్సు సర్వీసులను పాత బస్టాండ్ వరకు నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కొత్తబస్టాండ్ నుంచి పాతబస్టాండ్‌కు రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ లాభనష్టాలను చూడకుండా ప్రయాణికులకు సేవలందించాలని కోరుతున్నారు. అసలే టి.నర్సాపురం - చింతలపూడి రోడ్డు అధ్వానంగా ఉందని, ప్రయాణం కష్టంగా ఉంటోందని, లగేజీలతో, పిల్లలతో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోయారు. జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకుని సర్వీసులను పాతబస్టాండ్ వరకు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతిభా అవార్డుకు విద్యార్థుల ఎంపిక

టి.నర్సాపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల(బాలురు) నుంచి షైనింగ్‌స్టార్ ప్రతిభా అవార్డులకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపల్స్ కిశోర్ కుమార్ ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం టెన్త్ విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డుకు వరుణ్ సందేశ్, జీ.దయాసాగర్, బీ.బాలవంశీ, గుణరత్నలు ఎంపికైనట్టు ఈ నెల 9న ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్వి ఒక్కొక్క విద్యార్థికి రూ.20 వేల నగదు, జ్ఞాపికను అంజేయనున్నట్లు తెలిపారు. షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థులను రిటైర్డ్ ప్రిన్సిపల్ బీఎస్ఎన్.శంకరరావు, ఉపాధ్యాయులు, ఆఫీస్‌సిబ్బంది అభినందించారు.

సీపీఐ నాయకుల నిరసన

కామవరపుకోట, జూన్ 8(ఆంధ్రజ్యోతి):కార్మికులు రోజుకు పది గంటలు పనిచేయాలనే ప్రతిపాదన పట్ల సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు ఖండించారు.ఆదివారం సీపీఐ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్న ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట సీపీఐ నాయకులు రమణ, బుచ్చిబాబు, దుర్గారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మ ఆలయం కిటకిట

బుట్టాయగూడెం, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : అడవి బిడ్డల ఆరాధ్య దేవత గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో ఏజెన్సీకి తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో మొక్కులు తీర్చుకోడానికి అధికంగా భక్తులు అమ్మవారి ఆలయానికి వస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.

బహిరంగ ప్రకటన

[illegible] Komati Chandra Mohan, S/o Komati Lakshmanaswami [illegible]

షెడ్యూలు

West Godavari District, Badampudi Village for the Property R.S.No.42/2 Subdivision as 42/2b2, in RS.No.42/3 Sub-divisioned as 42/3b2, an extent of 113.33 under Plot No.7, an extent of 105.5 on southen side belongs to Sri Konati Chandramohan which was Layout and confirmed the LP No.48/2011/R of Badampudi village & Panchaythi

East : Land of the No.6 Plot
West : 30 Feet Road
South : Land of Park
North : Half of the Plot No.7

N.V.B.L.[illegible], [illegible]
Cell: 94402 15126 [illegible]

సన్ డే.. ఠారెత్తించిన ఎండ

కలిదిండి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేడి గాలులు వీయటంతో వృద్ధులు, గర్భిణులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో సాయంత్రం ఆరు గంటల వరకు జనం రోడ్లపైకి రాక ప్రధాన రహదారులు వెలవెలబోయాయి. నిత్యం రద్దీగా ఉండే మద్యానిగూడెం - ఏలూరుపాడు వంతెన నిర్మానుషంగా మారింది. జనం లేక వ్యాపార దుకాణాలు వెలవెలబోయాయి. పలు దుకాణాలను మూసివేశారు.

ప్రభుత్వ స్కాలర్‌షిప్‌కు నలుగురు విద్యార్థుల ఎంపిక

మండవల్లి జూన్ 8(ఆంధ్రజ్యోతి): లోకుమూడి జడ్పీ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. 2024 డిసెంబరు 8న జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఓపెన్ కేటగిరి పి. లక్ష్మణ్‌కుమార్ (108 మార్కులు), బి కౌశిక్(106 మార్కులు), సీహెచ్ జాన్ వెస్లీ(101 మార్కులు), బి గీతశ్రీ (96 మార్కులు) ఎంపికయ్యారని హెచ్ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన టీచర్ స్వాతిలక్ష్మిని అభినందించారు.

పట్టించుకోండి..



డైరెక్ట్ పంపింగ్ స్కీమ్‌కు పైపు తగిలించి నీటి చౌర్యం

నిర్భీతిగా నీటి చౌర్యం!

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు?

నూజివీడు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు కళ్ళు మూసుకున్నారో లేక తమనెవరేం చేస్తారు అనుకున్నారో ఏమో నూజివీడు మండలం అన్నవరం శివారు వెంకటాద్రిపురం గ్రామంలో ఏకంగా ఓ వ్యక్తి డైరెక్ట్ పంపింగ్ స్కీమ్ మోటార్‌కి పైప్ కనెక్షన్ ఇచ్చి నీటి చౌర్యానికి పాల్పడుతున్నాడు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో గ్రామస్థుల నీటి అవసరాలు తీర్చే డైరెక్ట్ పంపింగ్ స్కీం ఉంది. అయితే ఈ స్కీం బోర్ నుంచి నేరుగా తమ అవసరాలకు ఓ వ్యక్తి అక్రమంగా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. మోటార్ తిరిగినంతసేపు యథేచ్ఛగా నీరు సరఫరా అవుతుండగా గ్రామస్థులకు మాత్రం అరకొరగా నీరు అందుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై గ్రామస్తులు పలుమార్లు అధికారులకు, గ్రామ ప్రజా ప్రతినిధులకు పిర్యాదు చేసిన వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామ ప్రముఖులు చలసాని సూర్యనారాయణ వాపోతున్నారు. గ్రామ సచివాలయం వెంకట్రాదిపురంలోనే ఉన్నా, పంచాయితీ అధికారులు నిరంతరం నీటి విడుదల చేస్తున్నా బహిరంగంగా సాగుతున్న ఈ నీటి చౌర్యాన్ని మాత్రం ఎవరు అడ్డుకోలేదు, ఓ వ్యక్తికి ప్రయోజనం చేకూరేలా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించకుంటే గ్రామంలో ఎవరూ నీటి, ఆస్తి పన్నుల కట్టే పరిస్థితి ఉండదని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.



నూజివీడు పట్టణంలో అక్రమంగా మట్టి తోలకాలు సాగిస్తున్న దృశ్యం

జీవో మాటున..

యథేచ్ఛగా మట్టి అక్రమ తోలకాలు!

పట్టించుకోని అధికారులు

నూజివీడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పొలాలను సారవంతం చేసుకోవడంతో పాటు ఇళ్ళ స్థలాల మెరకకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను అడ్డుపెట్టుకుని మట్టి మాఫియా అక్రమాలకు తెర తీసింది. సెలవు దినాలలో ప్రత్యేకంగా శని, ఆదివారాల్లో రాత్రిపూట ఈ మట్టి మాఫియా వందలాది ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. నూజివీడు పట్టణానికి ఒక ట్రక్కు మట్టి తోలాలంటే దాదాపు రూ. 1200 వసూలు చేస్తూ బహిరంగంగా మట్టి తోలకాలు సాగిస్తున్నారు. ఇదే క్రమంలో శనివారం రాత్రి 10 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు పట్టణంలోని దత్తాశ్రమ ప్రాంతం, ఆర్ఆర్‌పేట తదితర ప్రాంతాలలో వందలాది ట్రక్కుల మట్టిని తోలినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల మాటున సాగుతున్న ఈ అక్రమ దందాపై జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఏ ఉద్దేశంతో అయితే జీవో ఇచ్చిందో ఆ లక్ష్యం మాత్రం నెరవేరే పరిస్థితి కానరావడం లేదు.



ఎంసెట్‌లో దేదీప్య సాయి ప్రతిభ

నూజివీడు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎంసెట్ ఫలితాలలో నూజివీడుకు చెందిన కె. దేదీప్య సాయి అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో 358వ ర్యాంకు సాధించింది. ఈమెను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

మౌనిక కుటుంబానికి బాసటగా 'మేము సైతం'



ముదినేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో క్యాన్సర్‌తో ఇటీవల మరణించిన బాలిక గొరిపర్తి మౌనిక కుటుంబానికి ఆదివారం ముదినేపల్లి మేము సైతం టీమ్ సభ్యులు బాసటగా నిలిచారు. దాకరం సర్పంచ్ జాస్తి రాజా, టీం సభ్యులు మువ్వా ఫణీంద్ర, బాపట్ల సుధీర్, డొక్కుమాల సందీప్‌కుమార్, హైకోర్టు అడ్వొకేట్ గుడిపూడి ఇజ్రాయేలు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భూపతి రవీంద్ర తమ వంతు సాయంగా బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను మౌనిక తల్లి దండ్రులకు అందజేశారు. దాకరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సోమ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మండవల్లి హైస్కూల్లో పూర్వ విద్యార్థులు సమ్మేళనం

అ'పూర్వ' సమ్మేళనం

మండవల్లి జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండవల్లి జడ్పీ హైస్కూల్లో 1990-91 నాటి పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం నాడు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదివినప్పటి తమ స్మృతులను, అల్లరి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడిపారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి గురువులైన లెక్కలు టీచర్ కె. సూర్యారావు, డ్రాయింగ్ టీచర్ ఎల్ఎస్ భాస్కరరావు, తెలుగు టీచర్ ఎకె మహాలక్ష్మీ, లాబ్ అసిస్టెంట్ బుజ్జి లను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



నూజివీడు పోలీస్‌స్టేషన్‌లో మహిళల ఫిర్యాదు



ముసునూరులో తెలుగు మహిళల ఫిర్యాదు



కైకలూరులో ఎస్ఐకు టీడీపీ నాయకుల ఫిర్యాదు



ముదినేపల్లిలో నిరసన ప్రదర్శన

కదం తొక్కిన మహిళలు

సాక్షి చానల్ డిబేట్‌లో అసభ్యకర వ్యాఖ్యలపై ఆగ్రహం ● సాక్షి ప్రతుల దహనం..

పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు ● నిందితులపై చర్యలకు డిమాండ్

నూజివీడు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణంరాజుపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నూజివీడు పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లో మహిళలు ఆదివారం ఫిర్యాదు చేశారు. సాక్షి ఛానల్ డిబేట్‌లో కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు మహిళల ప్రతిష్ట దిగజారేలా వ్యాఖ్యలు చేస్తూ అమరావతి చుట్టుప్రక్కల ప్రాంతాలలో వేశ్యలు ఎక్కువగా ఉంటారని అందుకే ఇతర ప్రాంతాల కంటే ఎక్కువ సంఖ్యలో స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయని చేసిన వ్యాఖ్యలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మహిళలు డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు కొమ్మని విజయ, తిరుమలశెట్టి సాధన స్రవంతి, మాజీ కౌన్సిలర్లు గొల్లు దుర్గాదేవి, కొంపల్లి కృష్ణకుమారి, బత్తుల వారిగూడెం సర్పంచ్ ముసునూరు లక్ష్మీ కాంతమ్మ, నూజివీడు మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు పి పుష్పలత, నజీమా, తదితరులు పాల్గొన్నారు. నూజివీడు మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు పాల్గొన్నారు. ముసునూరి రాజా, మలిశెట్టి జగదీష్, తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, తదితరులు సంఘీభావం తెలిపారు.

ముసునూరు: అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణంరాజుపై పోలీసులకు తెలుగు మహిళలు ఆదివారం ఫిర్యాదు చేశారు. సాక్షి ఛానల్ లైవ్ షోలో జరిగిన డిబేట్లో కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు మహిళల ప్రతిష్ట దిగజారేలా వ్యాఖ్యలు చేశారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించే సాక్షి ఛానల్‌పై కూడా చర్యలు తీసు కోవాలన్నారు. నాయకులు తులిమెల్లి రంగరావు, నక్కా యోహాను, చీలి అర్లప్ప, మహిళలు పాల్గొన్నారు.



ఆరిగిపల్లి పోలీస్‌స్టేషన్‌లో నాయకుల ఫిర్యాదు

ఆగిరిపల్లి: సాక్షి డిబేట్‌లో అసభ్యకర వ్యాఖ్యలు చేసిన జర్నలిస్ట్ కృష్ణంరాజుపై ఆదివారం కూటమి నాయకులు ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. అమరావతిపై సాక్షి ఛానల్‌లో జగన్ డైరెక్షన్‌తో ఈ నీచమైన ప్రచారం చేసినందుకు సాక్షి జర్నలిస్ట్ కృష్ణంరాజును, సాక్షి ఛానల్ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు పోలీస్‌వారికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆగిరిపల్లి టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు నాగమణి, నియోజకవర్గ తెలుగు యువత నలజాల హరిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు, చిట్టినేని శివరామకృష్ణ, రాజా, రాంబాబు, మాదల సత్యకుమార్, నియోజకవర్గ బీసీ కన్వీనర్ ఆరేపల్లి శ్రీనివాసరావు, మడుపల్లి గోపాల్, నూజివీడు బీజేపీ నాయకులు గోగినేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు, ఈదర సర్పంచ్ ఏసుపాదం, నల్లమోతు రమేష్, పొన్నం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: అమరావతిని వేశ్యల రాజధానిగా అవహేళన చేసిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాలని టీడీపీ జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి అన్నారు. ఆదివారం కైకలూరు టౌన్ పోలీసుస్టేషన్లో ఎస్సై డి. వెంకట్‌కుమార్‌కు పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డిబేట్ నిర్వహించిన కొమ్మినేని శ్రీనివాసు, కృష్ణంరాజు తదితరులపై కేసు నమోదు చేసి సాక్షి దినపత్రిక, టీవీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడమే గాక వాటిని మూసివేయాలని కోరారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి, టీడీపీ నాయకులు కాంట్రాక్టర్ కృష్ణంరాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ, మహిళా నాయకురాలు గుజ్జల రామలక్ష్మి, శీలం కృష్ణవేణి, మైనార్టీ నాయకులు ఎండీ జాని, ఎస్. బషీర్, బాషీద్, బాజానీ, ఎండీ ఉస్మాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: అమరావతిని వేశ్యల రాజధానిగా సంబోధించడాన్ని నిరసిస్తూ ముదినేపల్లిలో ఆదివారం టీడీపీ నాయకులు, మహిళలు ప్రదర్శనను నిర్వహించారు. ముదినేపల్లి సెంటర్‌లో సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేశారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీటీడీసీ డైరెక్టర్ కొడాలి వినోద్, ఏలూరు పార్లమెంటు టీడీపీ తెలుగు మహిళ కార్యదర్శి కందేపి పద్మ, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు రౌతు మాధవి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, పలువురు మహిళలు ప్రదర్శనలో పాల్గొని జర్నలిస్టు కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ శ్రీనివాస్‌కు టీడీపీ నాయకులు పిర్యాదు చేశారు.

టీచర్ల ఐక్యవేదిక దీక్షలను విజయవంతం చేయాలి

ముదినేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలను మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాల వద్ద నిర్వహించనున్న దీక్షలు, ధర్నాలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఈ నెల 10న మంగళగిరిలోని రాష్ట్ర విద్యాభవన్ ముట్టడి కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేసేందుకు, ఎస్జీటీలకు న్యాయం చేసేందుకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.



తాళాలు పగులగొట్టి చోరీ

రూ. 2.5 లక్షల సొత్తు అపహరణ

ముదినేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : విదేశాలకు వెళ్ళిన ఓ వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు వివరాలిలా ప్రకారం మండలంలోని చిగురుకోట గ్రామానికి చెందిన కొడాలి కృష్ణ ప్రసాద్ దంపతులు గత నెల 6న లండన్‌లోని తమ పెద్ద కుమార్తె వద్దకు వెళ్ళారు. అప్పటి నుంచి గుడివాడలో ఉంటున్న మరో కుమార్తె కొడాలి సాయిశ్రీ తన భర్తతో కలిసి ప్రతి శనివారం చిగురుకోట వచ్చి ఆ ఇంటిలో రెండు రోజులుండి సోమవారం తిరిగి వెళ్లేవారు. ఇంటి ఆవరణను శుభ్రం చేసేందుకు పని మనిషి కూడా నిత్యం వస్తూనే ఉంటుంది. ఈ నెల 7న పని మనిషి రాకపోవడంతో సాయిశ్రీ అమ్మమ్మ కమల కుమారి ఆ ఇంటికి రాగా తలుపుల తాళాలు పగులగొట్టి ఉండడం చూసి సాయిశ్రీకి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. వెంటనే ఆమె గుడివాడ నుంచి వచ్చి చూడగా బీరువా పగులగొట్టి అందులోని రూ. 2.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, ఒక ఐ-ఫోన్ చోరీ అయినట్టు గుర్తించారు. సీసీ కెమెరాను కూడా దుండగులు ధ్వంసం చేశారు. సాయిశ్రీ ఫిర్యాదు మేరకు కైకలూరు సీఐ రవి కుమార్‌తో పాటు ఏలూరు పోలీస్ క్లూస్ టీమ్ కూడా దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి ఏఎస్ఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.



చాట్రాయిలో విరిగిపడ్డ శివాలయ ధ్వజ స్తంభం



ఎగిరిన ఇంటి పైకప్పు

గాలి.. వాన బీభత్సం

● పిడుగుపడి మహిళ మృతి, నలుగురికి తీవ్ర గాయాలు ● కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు ● ఎగిరిన పైకప్పులు

చాట్రాయి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు వడగళ్లతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభం విరిగిపడిపోయింది. చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు గంటన్నర సేపు కురిసిన వర్షానికి జనం హడలిపోయారు. భయంకరమైన ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి జనజీవనం అతలాకుతలమైంది. మండలంలోని పోతనపల్లిలో పశువుల కాపర్లపై పిడుగు పడి అబ్బదాసరి శాంతకుమారి(50) అనే మహిళ మృతి చెందింది. ఓ మహిళా చనిపోగా నలుగురికి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



పిడుగుపాటుకు మృతి చెందిన శాంతకుమారి

కాలువల అభివృద్ధితోనే నీటి సమస్యకు చెక్

కైకలూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కాలువల అభివృద్ధితోనే శివారు గ్రామాలకు తాగు, సాగునీరు పుష్కలంగా అందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరు పంటకాలువ తవ్వకం పనులను అయ్యవారి రుద్రవరం వద్ద ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో కాలువల ప్రక్షాళన లేక ఎక్కడికక్కడ మేట వేసి శివారు గ్రామాలకు నీరు అందని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పోల్‌రాజ్, కైకలూరు పంటకాలువలు అభివృద్ధితో ఈ ఏడాది నీటి సరఫరాకు అవరోధం లేకుండా చేస్తున్నామన్నారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని కాలువల ప్రక్షాళనతో నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సాగునీటి సంఘాలు పనితీరు అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చినా రాకపోయినా ప్రతి కాలువ అభివృద్ధి పనులను దగ్గరుండి నీటి సంఘాల నాయకులు పనిచేయిస్తున్నారన్నారు. డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, భైరవపట్నం సాగునీటి సంఘ అధ్యక్షుడు గొల్లెంపల్లి కృష్ణారావు, ఇరిగేషన్ డీఈ శిరీష, టీడీపీ నాయకులు నారగాని కొండా, ముళ్లపూడి సత్తిబాబు, సజ్జా బాబి, పసలపూడి నాని తదితరులు పాల్గొన్నారు.



పంటకాలువల తవ్వకం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని

పోలీసుస్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

మండవల్లి: మండవల్లిలో పోలీసుస్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. కైకలూరు సీఐ రవికుమార్ బాండలి ఎస్సై సీహెచ్ రామచంద్రరావు ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ గుడివాడ చిట్టిబాబు, గుడివాడ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



పశువులకు నీరేదీ..?

నిరుపయోగంగా నీటి తొట్టె ● పట్టించుకోని అధికారులు

ముసునూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు లక్షలాది నిధులను వెచ్చించి నూతనంగా నీటితొట్టిలను నిర్మిస్తుంటే, గతంలో ఏర్పాటు చేసిన నీటితొట్టిలను వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మండలంలోని చింతలవల్లి పంచాయతీ శివారు గోగులం పాడులో ప్రధాన రహదారి పక్కన గతంలో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన నీటితొట్టె నిరుపయోగంగా ఉంది. ఈ నీటి తొట్టె పంచాయతీ బోరు, సరఫరా ట్యాంకు దగ్గరలోనే ఉంది. పశువులు, జీవాలకు ఈ నీటితొట్టె చాలా ఉపయుక్తంగా ఉండేది. కొన్నేళ్ళుగా ఈ తొట్టెలో నీరు పెట్టకపోవడంతో అక్కడక్కడ పగుళ్లు ఏర్పడ్డాయి. వినియోగంలోకి తేవాలని పలుమార్లు రైతులు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం శూన్యం. ప్రభుత్వం కొత్తగా నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తుంటే అధికారులు మాత్రం నిరుపయోగంగా ఉన్న నీటితొట్టెలను వినియోగంలోకి తీసుకు రావడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని రైతులు మండిపడుతున్నారు. నీటితొట్టెకు మరమ్మతులు చేసి, ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో సత్య నారాయణను వివరణ కోరగా మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామన్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు!

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు సంసిద్ధం కాలేకపోయారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి నూజివీడు నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కనీసం ఇప్పుడైనా టిడ్కో ఇళ్లు పూర్తి అవుతాయని, అవి కాస్త తమ సొంతం అవుతాయని లబ్ధిదారులు వేయి కళ్లతో ఎదురు చూస్తునే ఉన్నారు. ఇంకోవైపు టిడ్కో గృహ ప్రాంగణం ఇప్పటికే అత్యంత దీనావస్థలో ఉంది. ఇనుప చువ్వలు తుప్పుపట్టాయి. కట్టిన గోడలు నాచు పట్టాయి. విషపు పురుగులకు ఆలవాలంగా మారాయి. ఇంకోవైపు ఇలాంటి పరిస్థితే జంగారెడ్డిగూడెం టిడ్కోలోనూ కనిపిస్తోంది. ఇక్కడ 864కు పైగా గృహాలను మంజూరు చేస్తే వాటిలో 804 మాత్రం నిర్మాణాలకు దిగారు. కానీ ఏ ఒక్కటి పూర్తి చేయలేక పోయారు. బీ, సీ కేటగిరుల కింద మాత్రమే ఇక్కడ ఇళ్లను పేదలకు కేటాయించారు. 2018లో ఈ సముదాయాలకు శంకుస్థాపన జరిగినా, ఇప్పటికీ అతీగతీ లేదు.

ఇంకెప్పుడిస్తారు సార్:

జగన్ ప్రభుత్వం ఎలాగు చేయలేకపోయింది. అధికార పగ్గాలు చేజిక్కించుకున్న తెలుగుదేశం ప్రభుత్వం అయినా తొలి ఏడాది నిర్మాణాలు పూర్తి చేసి తామంతా గృహ ప్రవేశాలకు అవకాశం కల్పిస్తారని పేదలంతా ఎదురు చూశారు. ఏడాది పొడవునా ఎక్కడా పనులు ఆరంభం కాలేదు. గత ఐదేళ్లలో ఉన్న స్థితిగతులే కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా వీటి విషయంలో కలుగజేసుకుంటారా? లేదా అని ఇప్పటికే లబ్ధిదారులు కాస్తంత ఆగ్రహంతో ఉన్నారు.

జగన్ బయట తిరగలేరు: యనమదల



నూజివీడు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): శక్తి స్వరూపిణులైన మహిళలపై తన సొంత మీడియా సాక్షిలో అవమానకరంగా వ్యాఖ్యలు చేయించిన జగన్‌మోహన్‌రెడ్డి కనీసం బయట తిరిగే రోజులు కూడా లేవని టీడీపీ నూజివీడు మండల క్లస్టర్ ఇన్‌చార్జి యనమదుల నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సాక్షి డిబేట్లో మహిళలను వేశ్యలుగా సంబోధిస్తూ డిబేట్‌ను ప్రసారం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణం సాక్షి చానల్, వ్యాఖ్యలు చేసిన సదరు జర్నలిస్టులపై చర్యలు చేపట్టాలన్నారు.



క్షమాపణ చెప్పాలి: అంద్రాజు

కలిదిండి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై దుర్భాషలాడిన జర్నలిస్టు కృష్ణంరాజుపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మట్టగుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతిలో నివశించే మహిళలను వేశ్యలతో పోల్చి ఆరు కోట్ల ఆంధ్రులను అగౌరవపర్చడమే అన్నారు. ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు బహిరంగంగా అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలన్నారు. కూటమి నేతలు తిరుమాని గోపాలకృష్ణ, కె.పరశురాముడు, కోకా తాతయ్య, దున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దింటమ్మకు భక్తుల తాకిడి

కైకలూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట శ్రీ పెద్దింటి అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకు నేందుకు బారులుతీరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు పాలపొంగళ్ళను అమ్మవారికి నైవేదించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో కామినేని

మండవల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): భైరవపట్నం శివారు శోభనాద్రిపురంలో శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారి దేవస్థానం పునఃప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా 2వ రోజైన ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో గోపూజ, మండప దేవతార్చన, హోమం, జలాదివాసం, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు

ముదినేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిట కిటలాడింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాక పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దేవస్థానం వద్ద పుట్టలో పాలుపోసి స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా అంకమ్మ కొలుపులు

ఆగిరిపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి గౌడ బజారులో పామర్తి వారి అంకమ్మ తల్లి కొలుపులు ఘనంగా నిర్వహించారు. కొలుపులలో మూడో రోజు అమ్మవారి పూజా కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, నెరుసు సతీష్, మడుపల్లి గోపాల్, చిట్టినేని శివరామకృష్ణ పాల్గొన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈదర సర్పంచ్ డి ఏసుపాదం, నియోజకవర్గ తెలుగు యువత నాయకుడు నలజాల హరిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు, ఆగిరిపల్లి టీడీపీ పట్టణ అధ్యక్షుడు పామర్తి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234